కలలోని గాలిమేడ

ఆరోజు సాయంకాలం, కాలేజీ ఆడిటోరియం, ఇసుకవేస్తే రాలకుండా జనంతో కిటకిట లాడుతోంది. అప్పటికి నాలుగురోజులుగా కాలేజి సిల్వర్ జూబిలీ ఉత్సవాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనాడు కాలేజీ పాత విద్యార్థుల మధ్య ఉపన్యాసపు పోటీలు, అంతకంటే యింకా విశేషం ఏమిటంటే, ఒకానొకప్పుడు యీ కాలేజీలో చదువుకున్న ఒక విద్యార్థిని ఈనాడు ప్రఖ్యాత సినిమాతారగా పేరుపొందిన ఒకామె యీనాటి పోటీకి ఒక పెద్ద వెండి షీల్డు బహుమతి ఇవ్వటానికి అంగీకరించి యీ సభకు స్వయంగా విచ్చేసింది.

ఆవిడ రావటం తరువాయి సరా సరి లోపలికి వెళ్ళిపోయింది. ఆవిడ వచ్చిందని తెలియగానే అశేషజనం, ఎగ్జిబిషన్ స్టాల్సులో వుండవలసిన జనంతో సహా ఆడిటోరియంకు పరుగెత్తుకుంటూ వెళ్ళారు. కాలేజీ ఆవరణ అంతా నిర్మానుష్యం. అంటే యీ మాట నూటికి నూరుపాళ్ళు నిజంకాదనుకోండి. ఆడిటోరియం వరండాలో యిద్దరే యిద్దరు అమ్మాయిలు నిలబడి వున్నారు. ఈనాలుగు దినాలుగా అక్కడ జనసమూహం చూపులన్నీ యీ చిన్నారుల యిద్దరి మీదనే. అది వారి సౌందర్య మహిమ.

ఇంతలో అందమైన కారు ఒకటి ఆ వరండాలోకి వచ్చి ఆగింది. అందులోంచి ఒక అందమైన అబ్బాయి దిగి యిటువైపు చూశాడు. ఆ చూపుకు వీళ్ళు యిద్దరూ త్రిభంగిగా నిలబడ్డారు. రెండు జడల అమ్మాయి ఒక జడ వెనక్కు వేసుకుంటే. తల్లో పెట్టుకున్న మల్లె చెండు కనబడేలాగా ఒంటిజడ అమ్మాయి జడ ముందుకు వేసుకుని ముడి వేసుకున్న రిబ్బను ముడి విప్పి యింకొకసారి ముడి వేసుకుంది.

ఆ వ్యక్తిని చూడగానే ఆ అందమైన విగ్రహం, ఆ కళ్ళలో కనబడే స్నేహం, దర్జా డాంబికంలేని గొప్పతనం చూస్తూంటే వీళ్ళ ఇద్దరి మనస్సుల్లో వెయ్యి ఆలోచనలు మసలాయి అతడు తమవైపే రావడం చూసి.

తమ్ము పలుకరించడం కోసమే వస్తున్నాడనే ఆలోచన రాగానే, ఆ పిల్లలిద్దరి హృదయాలు ఒక్క క్షణం ఆగిపోయినంత పనైంది.

"నేను ఎంతో అందగత్తెను. నా అందం మెచ్చుకున్నాడు" అని ఎవరి మనస్సుల్లో వాళ్ళు గర్వంగా అనుకున్నారు.

అతను దాపుకు రానే వచ్చాడు. వీళ్ళకు రెండడుగుల దూరంగా వుండగానే -

"హలో !!" అని అన్నాడు.

సిగ్గుతో వాళ్ళిద్దరూ మరింత కుదించుకుని పోయారు.

ఎక్కడికైనా పారిపోతే బాగుండును అని వాళ్ళకు అనిపించింది. "పరాయి ఆడపిల్లలను ముక్కూ మొహం తెలియని వాళ్ళను పలుకరించే ధైర్యం యితనికి ఎవరు యిచ్చారు? " అని కోపం వచ్చింది.

"మా యిద్దరిలో ఎవరిని పలుకరించాడు?" అని సందేహం వచ్చింది.

"హల్లో!" అంటూ ఒక పురుష కంఠం వెనుకనుంచి బదులు పలికింది.

ఉలిక్కిపడి యిద్దరూ వెనక్కి తిరిగి చూశారు.

వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తిగారు అటునుంచి వస్తున్నారు. మరుక్షణం అతని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు,

"మీరు మరిచిపోకుండా వచ్చిరు. ఐ యామ్ వెరిగ్లాడ్!" అని అన్నాడు.

ఆడపిల్లలు యిద్దరూ ఒక్కసారి గతుక్కుమన్నారు. మరుక్షణం అక్కడినుంచి మాయమైనారు. మాయమైన వాళ్ళు మీటింగు హాల్లో ప్రత్యక్ష మయ్యారు. ఆ ఉపన్యాసపు పోటీ ప్రారంభం కావటానికి ఒక అర నిమిషం మాత్రం వ్యవధివుంది. ప్రార్థన జరిగింది.

అధ్యక్షుల వారు వేదిక నలంకరించారు. ఉపోద్ఘాతంగా ప్రిన్స్‌పాల్‌గారు రెండు ముక్కలు చెప్పారు.

"ఈనాడు చాలా సుదినం! మన కాలేజీలో విద్యనభ్యసించి కృతార్థులై జీవిత రంగంలో అడుగుపెట్టి అభివృద్ధి సోపానంలో ఎన్నో మెట్లు పైకి వచ్చి, నలుగురి చేత ఔననిపించుకున్న గొప్ప వ్యక్తులు కొందరు ఈనాడు యీ ఉత్సవంలో పాల్గొనటానికి వెంటనే అంగీకరించడం వారి సద్గుణ సంపత్తికి, వారికి ఈ విద్యా సంస్థయందు అంటే ఈ మాతృ సంస్థయందు గల అనురాగానికి తార్కాణం ..."

"ఈ ముసలి వాళ్ళతో యిదే చిక్కు. మొదలుపెడితే ఆగరు." అని రెండు జడల అమ్మాయి విసుక్కుంది.

ఆమె విసుగుదల ఆయన గ్రహించాడో ఏమో,

"ఈనాటి పోటీకి ఉపన్యాస విషయం' 'నాజీవన లక్ష్యం.' ప్రతి వక్త అయిదు నిముషాలసేపు మాట్లాడవచ్చు. గుడ్‌లక్ టు ఆల్' అంటూ కూర్చున్నాడు.

"అమ్మయ్యా!" అని కథానాయికలు యిద్దరూ ఒక్కసారే అన్నారు.

గంటమ్రోగింది. టీ. బీ పేషెంటులాంటి ఒక అమ్మాయి వేదిక మీదకు వచ్చి నిలబడింది.

"మిస్. తులసి, ఎమ్.ఎ. సోషియాలజీ. ప్రస్తుతం రీసెర్చి చేస్తున్నారు" అని ఆవిడని గురించి ఎరుకపరిచారు.

"విశ్వశాంతి నా జీవన లక్ష్యం!" అంటూ ఆవిడ అయిదు నిమిషాలు, వరద వచ్చినంత బీభత్సంగా, జనం దద్దరిల్లి పోయేటంత భయంకరంగా మాట్లాడింది. జనం తెప్పరిల్లుకునే లోపలే వెళ్ళిపోయింది.

విన్న వాళ్ళంతా "వాన వెలిసింది" అని అన్నారు.

"మిష్టర్ బలబీర్! ఆటోమొబైల్ యింజనీరు" అని పేరు వినగానే ఆరడుగుల పొడవు, రెండు వందల యాభై పౌనుల వ్యక్తి వేదిక మీదకు వచ్చాడు.

"అధ్యక్షా! సోదర! సోదరీమణులారా" అంటూ అతను గొంతుక విప్పగానే, జనం ఒక్కక్షణం రిచ్చబోయి మరుక్షణం ఫక్కున నవ్వారు. అతను కూడా ఒక్క క్షణం చిరునవ్వు నవ్వాడు. బ్రహ్మదేవుడికి పూజా పునస్కారం లేకపోవటానికి కారణం ఏమిటో అప్పుడు అందరికి అర్థమయింది. అంతటి నిండైన విగ్రహానికి కెనెడియన్ ఇంజను కూతలాంటి కంఠస్వరం యివ్వకుండా, పదహారు సంవత్సరాల ముగ్ధకంఠం యిస్తే నవ్వు రాక ఏం చేస్తుంది.

"నా జీవన లక్ష్యం ఏమిటి?" అంటూ అతను మొదలు పెట్టాడు.

"మల్లయుద్ధం! అని ఎవరో సభలోంచి అన్నారు. జనం మళ్ళీ గొల్లుమన్నారు. జడ్జీల ముఖంలోకూడా రవ్వంతచిరునవ్వు కనిపించింది. తాము యీ పోటీకి జడ్జీలమన్న విషయం అంతలో గుర్తుకువచ్చి చిరునవ్వు మాయమై గంభీరముద్ర ముఖంలోకి మళ్ళీ వచ్చింది.

అతని తరువాత అధ్యక్షులు "మిష్టర్ శివరామ్ ఆఫ్ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా" తరువాత వక్తని ఎరుక పరిచారు. అతను వేదిక పైన నిలబడ్డాడు. సభవారి వంక ఒక్కసారి కలయజూచాడు. ఆడవాళ్ళ గ్యాలరీవంక చూసినప్పుడు అతని పెదవులమీద చిరునవ్వు కనిపించింది.

"చాలా కొంటెవాడులాగా వున్నాడే" అని ఒంటిజడ అమ్మాయి అన్నది.

"తనే అందగాడని మహాగర్వం." అని రెండుజడల అమ్మాయి అన్నది.

"గర్వించినా తప్పులేదులే" అంటూ ఒంటిజడ పలికింది.

ఒక బర్మాముడి కోపంగా వీళ్ళ వంక చూసింది. ప్రక్కన కూర్చున్న కంజీవరం పట్టుచీరెతో ఏదో చెప్పింది. వెనుక వరుసలో కూర్చున్న "పోనీ టెయిల్" వీళ్ళ వంక ఒక్కసారి విసుగ్గా చూసి,మళ్ళీ అంతలోనే దృష్టి మరల్చుకుని స్టేజి వంక చూసి "బావున్నాడు" అనుకుంది.

"సభవారికి నమస్కారం" అంటూ అతను రెండుచేతులు జోడించాడు. ఆ సరళి, ఆ పద్ధతి, సభలోని ప్రతి వ్యక్తికి ప్రత్యేకంగా నమస్కరించినట్టు అనిపించింది. ఆ ఒక్కమాటలోనే అతనుదాదాపు ప్రతివారికి ఆత్మీయుడులాగా కనిపించాడు - ముఖ్యంగా మన కథానాయికలకు.

"ఈ సభకు వచ్చేవరకూ నా జీవిత లక్ష్యాన్ని గురించి నేను ఎన్నడూ ఆలోచించలేదు. కాని జీవితంలో అనేక వసంతాలు గడిచిపోయాయి. జీవితంలో ఎన్నో సాధించాననే గర్వపడ్డాను. ఎన్నో సాధించగలననే ధైర్యం, ఆశతోనూ వున్నాను. కాని నా జీవిత మనేది యీనాటి వరకూ లక్ష్యరహితంగానే గడిచిందా? ఈనాటివరకూ నాది గమ్యస్థానంలేని ప్రయాణమా? ఈ ప్రయాసకు ఒక లక్ష్యం, ఆదర్శం లేనేలేవా? అనే ఆత్మ విమర్శ నాలో బయలుదేరింది. పిలుపు కోసం నిరీక్షిస్తున్న యీ గంట వ్యవధిలో నేను ఇదే విషయం గురించి మనస్సులో మననం చేస్తూ కూర్చున్నాను. ఈ ప్రశ్నకు సమాధానం లభ్యమో, అలభ్యమో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా ప్రాజ్ఞులైన మీ ఎదుట, నాసమస్యను విన్నవించి, కూలంకషంగా పరిశీలించగలిగితే పరిష్కారం సుగమం, సులభం కాగలదనే ఆశతో మీకు మనవి చేస్తున్నాను.

విద్యార్థిగా, ఉద్యోగిగా ప్రయాణం అనేది నా జీవితంలో ఒక ముఖ్య భాగమయింది. లక్షలాది జనంతో కిటకిటలాడే పట్టణంలో యీనాడు గడిపితే, మరుసటి దినం నాగరికతకు దూరంగా - నాకు నేనే తోడుగా కారడవులలో, నిర్జన పదేశాలలో అనేక రోజులు, వారాలు గడపవలసిన ఉద్యోగం నాది. భూగర్భ శాస్త్రం వల్ల నేను భుక్తిని పొందగలుగుతున్నాను. కాని నా మనస్సుకు రక్తి, నా హృదయానికి తృప్తి నిరంతరం విద్యాన్వేషణలోనే నాకు కనిపించింది. అంతులేని అపారమైన యీ జ్ఞాన సాగరాన్నుంచి, లభ్యమైనంత విజ్ఞానాన్ని

స్వల్పమైన ఈ మానవ జీవన కాలంలో పొందాలనేదే నా నిరంతర వాంఛ.

విద్య అనేది ఒక్క పుస్తకాలతోనే కాక, మానవ జాతి సాహచర్యంలో కూడా వున్నదని నా ఉద్దేశం. జీవితమంటే ఏమిటో పుస్తక విద్య చెప్పగలిగితే జీవించడమంటే ఏమిటో నేనీ మానవజాతి దగ్గర నేర్చుకున్నాను.

ఈ నిరంతర విద్యాన్వేషణ, తృప్తిలేని యీతృష్ణ నా జీవిత లక్ష్యమని, అదే నా గమ్యస్థానమని మీరంతా అంటే ఒప్పుకోవడానికి నాకేం అభ్యంతరం లేదు... థాంక్యూ వెరీమచ్"

అంటూ సభవారికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

"వండర్‌ఫుల్ స్పీచ్." అని అమ్మాయిలు ఇద్దరూ అనుకున్నారు.

"యస్" అని బర్మాముడి వంతపలికింది.

"సరిగ్గా గ్రెగరీ పెలక్‌లా వున్నాడు" అని పోనీటెయిల్ అనుకున్నది.

తరువాత ఎవరెవరో వచ్చి మాట్లాడారు. ఏం మాట్లాడారో ఎల్లా మాట్లాడారో అనే విషయం వీళ్ళకు తెలియదు. పోటీ అయిపోయింది. ప్రైజులుకూడా ఎవరెవరికో వచ్చాయి. అందులో ఒక ప్రైజు గ్రెగరీ పెక్‌కు వచ్చింది. ఆ బహుమతిని యిస్తూ వెండితెర తార అతనితో:

"మీ ఉపన్యాసం నన్ను బాగా ఆకర్షించింది. నిరంతర విద్యాన్వేషణ ఒక తపస్సులాంటిది. ఆ తపస్సు ఫలించి, మీకు చక్కటి వరం లభించాలని మా ప్రార్థన, కంగ్రాచులేషన్స్" అని అంది.

సభ ముగిసింది. సీతా, సావిత్రి వరండాలోకి వచ్చి నిలబడ్డారు. జనం ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. అంతా దాదాపుగా పూర్తిగా వెళ్ళిపోయిన తరువాత వైస్ ప్రిన్సిపాల్ గారి వెంట అతను యిటే వస్తున్నాడు.

"కంగ్రాచులేషన్ను చెబుదామా!" అని సావిత్రి అన్నది.

"డోన్ట్ బీ సిల్లీ" అని బదులు వచ్చింది.

"ఏం?"

"ఎవ్వరూ యింట్రడ్యూస్ చెయ్యకుండా మాట్లాడితే ఏమనుకుంటాడు?"

"చొరవగలవాళ్ళమనుకుంటాడు."

"అల్లా అనుకోడు, వెకిలివాళ్ళమనుకుంటాడు."

వీళ్ళ వాదం జరుగుతూనే వుంది. వాళ్ళు దగ్గరకు రానే వచ్చారు.

"మీ ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ నాకు నచ్చింది." అని వైస్ ప్రిన్సిపాల్‌గారు శివరాంతో అంటున్నారు.

అతను వీళ్ళను దాటి వెళ్ళిపోతూ ఒక మనోహరమైన చిరునవ్వు చిందించివెళ్ళిపోయుడు.

అమ్మాయిలు యిద్దరూ మనస్సులో అందల మెక్కినంత సంబరపడ్డారు.

మళ్ళీ ప్రశ్న వెంటనే వచ్చింది. చిరునవ్వు ఏ చిన్నారికోసం అని.

"నన్ను చూసే నవ్వాడు" అని ఎవరికి వాళ్ళు అనుకున్నారు.

"ఏం పొగరు?" అని ఒక పిల్ల అనుకుంది.

"థాంక్యూ" అని ఇంకొక పిల్ల బిగ్గరగానే అనుకుంది.

కారు ఎక్కి అతని త్రోవను అతను వెళ్ళిపోయాడు.

రోజులు వారాలు గడిచిపోయాయి. అతను వాళ్ళకు మళ్ళీ కనిపించలేదు. అతనిని గురించిన తలంపు వీళ్ళ మనస్సులో మాసిపోయింది. ఆరోజు "హిందూ" లో రెండు వార్తలు పడ్డాయి. ఒకటి - ఎల్ఫిన్‌స్టన్‌లోకి గ్రెగరీపెక్ నటించిన ఒక చిత్రం వచ్చిందని - రెండవది - ప్రముఖ భూగర్భ శాస్త్రవేత్త మిస్టర్ శివరాంకు, 'ఆర్యుల భాషలు, వాటి లిపి స్వరూపములు" అనే విషయం మీద జరిపిన పరిశోధనకు గవర్నమెంటు ఒక ప్రత్యేక పారితోషకం యిచ్చినదిని.

మనసున దాగిన మాట మళ్ళీ బయటకు వచ్చింది. 'అతను ఎక్కడ వున్నాడో? ఏం చేస్తున్నాడో!' అని ఇద్దరి హృదయాలలో అనిపించింది.

"సాయంకాలం సినిమాకు వెడదామా?" అని అడిగింది సావిత్రి.

"ఓ కె" అని సీత అన్నది.

సినిమా చూస్తున్నంత సేపు ఇద్దరి మనస్సుల్లో అతని బొమ్మే మసలుతోంది. వేడినిట్టూర్పులలో, ఆరని సెగలతో సినిమా గడిచింది.

"కూల్ డ్రింక్ త్రాగుదామా" అంది సీత.

రోడ్డుదాటి యిద్దరూ హోటలు ఎయిర్ లైన్సుకు వెళ్ళారు, అక్కడి సోడా ఫౌంటెను జనంతో కిటకిటలాడుతోంది. ఉన్న అన్ని బల్లల దగ్గర ఎవరో ఒకరు వున్నారు. ఒక బల్లదగ్గర సూట్ వేసుకున్న వ్యక్తి ఎవరో ఒంటరిగా కూర్చొని వున్నాడు. ఇంకొక బల్లదగ్గర ఒక్క కుర్చీ మాత్రం ఖాళీగా వుంది. వీళ్ళు ఇద్దరూ ఒక్క క్షణం తటపటాయించారు.

అతను వెనక్కి తిరిగి చూశాడు. ఈ ఇద్దరూ ఒక్క క్షణం మూగపోయారు. అతను అతనే. గ్రెగరీ పెక్‌లాంటి శివరాం. వీళ్ళ పరిస్థితి గ్రహించాడో ఏమో !!

"మీరు ఇక్కడ కూర్చోండి. నేను యింకొక టేబుల్ దగ్గర కూర్చుంటాను అని అన్నాడు.

'థాంక్స్' అని సావిత్రి అన్నది.

అతనులేచి ప్రక్క టేబుల్ దగ్గరకు వెళ్ళ బోయాడు.

"పరవాలేదు. మీరు కూడా కూర్చోండి" అని సీత ఆహ్వానించింది.

'మీకు ఇబ్బందేమో'...

"ఇబ్బందేం లేదండి. కూర్చోండి." అని యిద్దరూ ఒక్కసారే అన్నారు.

"థాంక్యూ వెరిమచ్" అని అతను అన్నాడు.

"ఆమాట అనవలసింది మేము" అని సావిత్రి అన్నది.

వెయిటరు వచ్చి వీళ్ళకు కావలసినవి ఆర్డరు తీసుకుని వెళ్ళాడు.

'మళ్ళీ ఎక్కడైనా ఉపన్యాసాలు యిస్తున్నారా?" అని సావిత్రి అడిగింది.

అతను ఉలిక్కిపడి "ఐ బెగ్ యువర్ పార్డన్" అని అన్నాడు.

"కాలేజీ సిల్వర్ జూబిలీలో మీరు మాట్లాడిన ఉపన్యాసం మేము విన్నాం. చాలా బాగుంది." అని సావిత్రి అంది.

"థాంక్యూ ... మీరుకూడా మా కాలేజీ స్టూడెంట్సా?"

"అవును ... ఆరోజున మిమ్మల్ని కంగ్రాచులేట్ చేద్దామని అనుకున్నాం."

"థాంక్యూ ... మిస్..."

"నా పేరు సావిత్రి, నాఫ్రెండ్ సీత."

"గ్లాడ్ టు మీట్ యూ ... నా పేరు శివరాం"

"మాకు తెలుసు, మళ్ళీ మీకు యింకొకసారి కంగ్రాచులేషన్సు చెబుదామని అనుకుంటున్నాం."

"దేనికి?"

మీకు గవర్నమెంటు ప్రైజు యిచ్చిందని చదివాం. చాలా ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి.

"దేనికి?"

"జియాలజిస్టుకి భాషల లిపిమీద బహుమానం వచ్చిందంటే, అతను ఎటువంటి జీనియస్సో తెలుస్తుంది."

"దానికేం "జీనియస్" అక్కర్లేదు. ఖనిజాలు, లోహాలేకాదు, పురాతన వస్తువులన్నింటితోనూ మాకు కొంతకాకపోతే కొంత పని వుంటుంది. మన పూర్వీకులని గురించి తెలుసుకునేటప్పుడు, వారి భాషా లిపి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఆర్యుల భాష సంస్కృతం కాకపూర్వం, ఎటువంటి లిపి వుండేది అనేదే .ఆ జిజ్ఞాస. అదే నేను వ్యాసయాపకంగా వెలిబుచ్చాను. అంతకుమించి దాంట్లో ఏం ప్రత్యేకతలేదు."

"వినయం గొప్పవారి లక్షణం" అని సావిత్రి అన్నది.

అతను ఒక్క క్షణం సావిత్రివంక పరకాయించి చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఒక చిన్నమాట చెప్పనా?" అని అన్నాడు.

సావిత్రి అతనివంకనే చూస్తూ వుండిపోయింది.

"చెప్పండి" అని సీత అన్నది.

మీ ఫ్రెండ్ ప్రెస్ రిపోర్టరుగా బాగా రాణిస్తారు."

సావిత్రి ఉలిక్కిపడ్డది.

"ఎందుకలా అన్నారు?" అని సీత అడిగింది.

"చొరవా, మంచితనం, ధైర్యం, యీ మూడు ఆ ఉద్యోగానికి కావలసిన లక్షణాలు. అవి మీ ఫ్రెండు దగ్గర సమృద్ధిగా వున్నాయి."

సావిత్రి ముఖంలో రవ్వంత కోపం కనిపించింది.

తరువాత వీళ్ళిద్దరూ లాంఛనంగా అభ్యంతరం చెప్పినా, అతనేం సీరియస్‌గా తీసుకోకుండా, వీళ్ళ బిల్లుకూడా తనే చెల్లించాడు.

బయటకు రాగానే "మీరు ఏ పేట వెళ్ళాలి" అని అడిగాడు.

"త్యాగరాయ్ నగర్"

"రండి, మా కారులో డ్రాప్ చేస్తాను."

"మీకు అనవసరమైన శ్రమ."

"దాని కేముందిలెండి!"

కారు ముందు సీటులో ముగ్గురు కూర్చోవడానికి స్థలం వుంది. కాని అతను వీళ్ళ యిద్దరి కోసమని వెనక సీటు తలుపు తీసేసరికి, వాళ్ళ ఇద్దరి మనస్సు ఒక్క క్షణం చివుక్కుమన్నది. అంతలోనే కారు కదిలింది.

ఈ చిరుకోపం తగ్గేసరికి కారు టీనగర్ వాణీమహాలు చేరింది.

"కుప్పుస్వామి స్ట్రీటు" అని వెనుక సీటులోంచి సావిత్రి కంఠం పలికింది. ఇరవై తొమ్మిదో నెంబరు యింటిదగ్గర కారు ఆగింది.

అమ్మాయిలు ఇద్దరూ దిగారు.

"లోపలకు రండి" అని అతన్ని ఆహ్వానించారు.

అతను గడియారం వంక చూసుకున్నాడు. ఒక్కక్షణం తటపటాయించాడు. "థాంక్యు... కానీ మీరు నన్ను ఎక్స్క్యూజ్ చెయ్యాలి... నాకొక అర్జెంటు ఎంగేజిమెంటు వుంది. ఈసారి ఎప్పుడైనా వస్తాను. గుడ్‌నైట్" అని అన్నాడు.

అమ్మాయిలు ఇద్దరికీ అంతులేని కోపం, అలవి కాని నిరాశ కలిగింది. కాని అంతలోనే తమాయించుకుని "గుడ్‌నైట్" అని అన్నారు.

"ఏ మాత్రం మేనర్సు లేవు" అంటూ సీత విసుక్కుంది.

"నిజంగా పని వుందేమో?" అంటూ సావిత్రి సరిచెప్పబోయింది.

"నువ్వెప్పుడూ యింతే వూళ్ళో వాళ్ళందరినీ వెనకేసు కుని వస్తావు."

"నువ్వు మాత్రం తక్కువేమిటి? ప్రతి చిన్న విషయానికి నీకు కోపం వస్తుంది.'

"మహా శాంతమూర్తివి బయలుదేరావు."

అంటూ సీత విసవిసా నడిచి తమ యింటికి వెళ్ళిపోయింది.

సావిత్రి మాత్రం సీత వెళ్ళిన దిక్కే చూస్తూ నిట్టూర్పు విడిచి 'పిచ్చిపిల్ల' అని అనుకుంది.

"ఆకారులో అతను ఎవరే" అంటూ సావిత్రిని వాళ్ళ అమ్మ అడిగింది.

"ఆయన శివరాం గారని గొప్ప సైంటిస్టు. మొన్న సిల్వర్ జూబిలీలో కాలేజీలో ఉపన్యాసం యిచ్చారు. ఇవ్వాళ సినిమా దగ్గర కనిపించి పలకరించారు. ఇటే వెడుతున్నాను గదా. మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తామని అన్నారు."

"ఇంట్లోకి రమ్మని పిలవలేదేం?"

"రమ్మని పిలిచాం, ఏదో అర్జెంటు ఏంగేజిమెంటు వుందని వెళ్ళిపోయారు. ఈసారి ఎప్పుడైనా పిలుస్తాను."

వారం గిర్రున తిరిగి వచ్చింది. "సావిత్రీ! సావిత్రీ!" అంటూ సీత వచ్చింది. ఆమె కోపం అప్పుడే పోయింది.

"ఈరోజు హిందూ చూశావా!" అందీ సీత.

"ఏం జరిగింది!" అని అడిగింది సావిత్రి.

పేపరులో చివరి పేజీ చూపించింది. అక్కడ శివరాం ఫోటో వుంది. దానికింద

జియాలజీలో ప్రత్యేక శిక్షణ పొందడానికి స్కాలర్‌షిప్ మీద కెనడా వెడుతున్నాడని రాసివుంది.

సావిత్రి ఏం మాట్లాడలేదు. అద్దం వంక చూసి తలదువ్వుకుంటూ ఒక నిట్టూర్పు విడిచింది.

మళ్ళీ ఎన్ని సంవత్సరాలకు కనిపిస్తాడో ... ఒకసారి కలుసుకుని కంగ్రాచులేషన్సు చెప్ప గలిగితే, తనకు చాత కాదు ... సీతకున్న ధైర్యం తనకు లేదు.

"ఏం అల్లావున్నావేం?" అని సీత లడిగింది.

"ఏం లేదు సీతా ... ఆయనకు కంగ్రాచులేషన్స్ చెబుదామా !"

"నాకేం పని?"

"ఐతే యీ పేపరు ఎందుకు తీసుకు వచ్చావు !"

"నువ్వు చూసి సంతోషిస్తావని."

"ఏం నీకు మాత్రం సంతోషంగా లేదా?"

"నాకెందుకు సంతోషం?"

"మనకు తెలిసిన ఒక వ్యక్తికి ఇటువంటి గౌరవం అభించడం, మనకు సంతోషం కాదా?"

'ఆయన్ను గురించి నాకేం తెలియదు. తెలుసుకోవాలనే కోరిక కూడా లేదు.'

"సరే."

"ఈపూట కాలేజీకి వస్తావా?"

"ఒకగంట లేట్‌గా వస్తాను."

సీత వెళ్ళిపోయింది. సావిత్రికి ఏం చెయ్యాలో తోచలేదు. ఆయనకు ఫోనుచేసి మాట్లాడితే? అమ్మో ! ఏమనుకుంటాడో? ఆయనతో తనకేమంత పరిచయమని ఫోనుచేసి మాట్లాడటానికి, ఆయన్ను చూసింది రెండుసార్లు. మాట్లాడింది ఒకేసారి. ఈ స్వల్ప పరిచయం పురస్కరించుకుని ఫోను చేస్తే ఏమనుకొంటాడు? ఒక పరాయి వ్యక్తిని గురించి తన హృదయం దేనికింత ఆరాటపడుతోంది? కాని అతను పరాయి వాడంటే మాత్రం తన హృదయం అంగీకరించదు. అతను తనకు ఎంతో ఆత్మీయుడు!

"తనవాడు" అని ఎంతగానో మనస్సు మరీ మరీ చెబుతోంది. కాని ఆ తలపు మనస్సులో మసలితేనే తనకు సిగ్గు ముంచెత్తుకొస్తుంది ... ఒక్కసారి ఆయన్ను కలుసుకుని కంగ్రాచులేషన్సు చెప్పాలి.

కాలేజీకి బయలుదేరి బస్సుస్టాండు దగ్గరకువచ్చి నిలబడింది. ఆఫీసులవేళ అయిపోవడంవల్ల బస్సుస్టాండు పలచ పలచగా వుంది. పది నిముషాలయింది. బస్సు రాలేదు.

వెడుతున్న ఒక నల్లకారు రోడ్డు మీద సడన్ బ్రేకు వేసుకుని ఆగింది. మరుక్షణం ఒక కంఠం.

"నమస్తే !!" అని పలికింది.

అతను, అతనే సావిత్రికి అంతులేని ఆనందం, విపరీతమైన సిగ్గు ఒకే క్షణంలో కలిగాయి. కళ్లు మిలమిలా మెరిశాయి. ముఖం ఒక్క క్షణం కెంపు వన్నె కొచ్చింది.

"నమస్తే" అని అతి ప్రయత్నం మీద అనగలిగింది.
"కాలేజీకి వెడుతున్నారా?"
"ఊ!"
"రండి. మా కారులో డ్రాపు చేస్తాను."
సావిత్రి అక్కడనుంచి కదల్లేదు.
"ఓ ఐయాం సారీ" అని అంటూ అతను కారుదిగి బ్యాక్‌డోర్ తెరిచాడు.
"థాంక్యూ వెరీమచ్" అంటూ సావిత్రి కారులోకి ఎక్కింది.
"మీ ఫ్రెండు ఏరి?" అని అతను అడిగాడు.
"కాలేజీకి వెళ్ళింది"
కారు బయలుదేరింది. అతను ఏం మాట్లాడలేదు, రోడ్డు వంకనే చూస్తున్నాడు.
సావిత్రి ఎంతో ధైర్యంకూడ గట్టుకుని,
"ఇవ్వాళ పేపరులో చూశాం, కంగ్రాచులేషన్సు' అని అన్నది.
"థాంక్యూ"
కారు కాలేజీకి చేరింది. సెకండ్ అవర్‌కు యింకా పదినిముషాలు వ్యవధి వుంది. కారు దిగబోతూ సావిత్రి "రేపు సాయంకాలం మీరు మాయింటికి టీ కి రావాలి" అని అంది.
"నేనా?"
"మీరే ! తప్పకుండా రావాలి."
"శనివారం!"
"అవును. పైగా మా లమ్మగారు మిమ్మల్ని చూడాలని చాలా అనుకుంటున్నారు:
"ఐతే తప్పకుండా వచ్చి వారి దర్శనం చేసుకుంటాను."
"తప్పక రావాలి."
"అల్లాగేనండి ... థాంక్యూ"
సావిత్రి కాలేజీలోకి నడిచే వెళ్ళింది. కాని కాలు నేలమీద నిలవడం లేదు. గాలిలో తేలిపోతున్నట్టు అనిపించింది.
లేడీస్ రూమ్‌కు వెళ్ళగానే సీతా అని పిలిచింది. ఇద్దరు సీతలు ఒక్కసారే "హల్లో !" అని అన్నారు.
మన సీత మాత్రం దగ్గరకు వచ్చింది.
"ఏం" అన్నట్టు కళ్ళతోనే ప్రశ్నించింది.
"ఆయన కనిపించారు. నన్ను కారులో డ్రాప్ చేశారిక్కడ. రేపు మా యింటికి టీకి రమ్మన్నాను. వస్తానన్నారు. నువ్వుకూడా రావాలి."
"పానకంలో పుడకని. నేను దేనికి?"
"ఛా, అలా అంటేనే నాకు కోపం... నువ్వు లేకుండా నేను ఏం పనీ చెయ్యలేను. రానంటే వీల్లేదు. ప్లీజ్ !"
"చూడు సావిత్రీ. నేను ఒక్క మాట చెబుతాను, కోపం వద్దు."
"కోపం దేనికి?"

"శివరాంను నువ్వు లవ్ చేస్తున్నావు."

"సీతా !"

"మెల్లిగా మాట్లాడు !"

"కాదు సీతా ! నువ్వు కూడా వస్తేనే నాకు ఎంతో సంతోషం. ఆయన నిన్నుగురించికూడా అడిగారు వస్తావు కదూ ... ప్లీజ్."

సీత ఏం మాట్లాడలేదు ... నవ్వి వూరుకుంది.

ఆరోజు రాత్రి పది దాటింది. పుచ్చపువ్వులాంటి వెన్నెల. ఆ వెన్నెలలో మేడమీద ఒంటరిగా కూర్చుంది సావిత్రి. నిద్రపోదామనే ఆలోచన వచ్చింది. కాని కంటికి కునుకు దూరమయింది.

రేపటిని గురించి ఆలోచిస్తూ వుంటే యీనాడు నిద్ర రావటం లేదు.

"రేపటిరోజు నీ జీవితంలో చిరస్మరణీయమైన దినం" అని మనస్సు వెయ్యిసార్లు పలికింది.

రేపు సాయంకాలం ఆయన వస్తారు. మా యిల్లు అంతా చూపిస్తాను. అమ్మకు ఆయన్ను పరిచయం చేస్తాను. మేము తన అంతస్తుకు తగిన వారమని ఆయనకు అనిపిస్తే చాలు. మా యింట్లో అందరికీ ఆయన అంటే ఎంత గౌరవమో ఆయన తెలుసుకుంటారు. ఆయనకు పార్టీ యిద్దామని చెప్పగానే, అమ్మ ఎంత సంతోషించింది !! ఇంతవరకూ ఆయనతో రెండుసార్లు మాత్రమే మాట్లాడగలిగాను. కాని ఆయన ఎంత ఆత్మీయుడుగా కనిపిస్తున్నారు! రేపు తనివితీరా ఆయనతో మాట్లాడవచ్చు ! ఎంత మంచివాడు ! అంత చదువూ ఐశ్వర్యం వుండి కూడా ఎంత నిగర్వంగా వుంటారు!

ఆయన కెనడా వెళ్ళిపోతే అంతకాలం చూడకుండా ఎల్లావుడను? రేపు సాయంకాలం పార్టీ అయిపోయిన తరువాత బీచికి వెళ్లి వెన్నెలలో కూర్చుని సముద్ర తరంగాల వంకచూస్తూ, ఆయనతో ఎన్నో విషయాలు మాట్లాడుతూ యీ ప్రపంచాన్నే మరచిపోవాలి.

నా మనస్సుని ఆయన గ్రహించి తన పాదాలచెంత రవ్వంత చోటు యిస్తే చాలు.

అనేక యుగాలు గడిచి మరునాటి సాయంకాలం వచ్చింది. సరిగ్గా ఆరుగంటలకు ఆ నల్లటికారు సావిత్రి వాళ్ళ యింటిముందు ఆగింది. అతను క్రిందకు దిగాడు. ఆనందంతో సావిత్రి హృదయం ఉప్పొంగిపోయింది. చిరునవ్వు పెదవులమీ చిందులాడింది. రెండంగల్లో కారు దగ్గరకు వెళ్ళింది.

అతని వంకచూస్తూ "నమస్తే !" అని అన్నది.

కారులోంచి ఒక అందమైన అమ్మాయికూడా దిగింది. ఆ అమ్మాయికి సావిత్రిని పరిచయం చేస్తూ,

"మిస్. సావిత్రి ! మా కాలేజీలో చదువుతున్నారు. ఈవిడ నా భార్య ! లలితా శివరాం !" అని అన్నాడు.